క్లుప్తంగా

పల్స్‌పోలియో ఇంటింటి సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న విజయలక్ష్మి

కేశంపేట: పల్స్‌పోలియో ఇంటింటి సర్వేను వైద్య సిబ్బంది సోమవారం నిర్వహించారు. షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి మండల పరిధిలోని సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, కొత్తపేట గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ప్రతి ఇంటిని సందర్శించి పరిశీలించాలని అంగన్‌వాడీ, వైద్య సిబ్బందికి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో అప్తామిలిక్ అధికారి శ్రీహరి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, అంగన్‌వాడీ టీచర్ శశికళ, ఎఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూలో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

షాద్‌నగర్: మహారాష్ట్రలో జరిగిన ఆల్ ఇండియా కుంగ్‌ఫూ, కరాటే జూడో ఛాంపియన్‌షిప్ పోటీల్లో షాద్‌నగర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. బ్రేవ్ యూత్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కుంగ్‌ఫూ పోటీల్లో షాద్‌నగర్‌కు చెందిన న్యూ పవర్‌కుంగ్ ఫూ అకాడమీ విద్యార్థులు జశ్వంత్, సాత్విక్, రాహుల్, ప్రేమ్‌కుమార్‌లు ఉత్తమ ప్రతిభను కనబర్చి మొదటి స్థానంలో నిలిచారు. వీరికి పథకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ వీరాచారి, మాస్టర్లు బాల్‌రాజ్, హైమద్ పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టాలి

ఆల్‌ఇండియా క్రిస్టియన్ ఫెలోషిప్ సభ్యుల డిమాండ్



నిరసన తెలుపుతున్న పాస్టర్లు తదితరులు

చేవెళ్ల: క్రైస్తవుల, చర్చిలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడు టీడీఎస్ మణి అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని జన్వాడలో జరిగిన ఘటనపై సోమవారం నిరసన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జన్వాడలో క్రైస్తవులు, చర్చిపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో బాధితులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట దాడులు జరుగుతు న్నాయని, వీటిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేని యెడల అన్ని క్రిస్టియన్ సంఘాలు ఏకమై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన సభలో వ్యవస్థాపక అధ్యక్షు డు దానియల్, రవికుమార్, వివిధ సంఘాలకు చెందిన చర్చిల పాస్టర్లు కిష్టపర్, సామేల్, జహంగీర్, దానియల్, యేసుదాస్ పాల్గొన్నారు.

దైవ చింతన అలవర్చుకోవాలి



పడిపూజ చేస్తున్న లింగం, శంకరయ్య

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని గురుస్వామి లింగం అన్నారు. సోమవారం మండలంలోని సాయిరెడ్డిగూడ గ్రామానికి చెందిన దోనూరి శంకరయ్య నిర్వహించిన మహాపడిపూజ గురుస్వామి లింగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇష్ట దైవాన్ని ఆరాధించి, భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కొంత సమయం దేవునికి కేటాయించాలని సూచించారు. అనంతరం శివస్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివస్వాములు రాజు, కరుణాకర్, రమేశ్, మల్లేశ్, హరివర్ధన్, శివ తదితరులున్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన నేతలు

మొయినాబాద్‌రూరల్: సీఎం రేవంత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో సోమవారం మొయినాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు దేవరంపల్లి మహేందర్‌రెడ్డి కలిశారు. అనంతరం రేవంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఉన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరినట్లు చెప్పారు.

మహిమాన్వితుడు రామలింగేశ్వరుడు

- భక్తుల కొంగు బంగారంగా స్వామివారు
- సాక్షాత్తు శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం
- ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు
- మహాశివరాత్రి వరకు కొనసాగనున్న జాతర



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన రామలింగేశ్వరస్వామి దేవాలయం

షాద్‌నగర్‌రూరల్: కాశీశైవ క్షేత్రంగా ఉత్తర రామలింగేశ్వరస్వామి దేవాలయం దినదిన ప్రవర్ధమానంగా విరాజిల్లుతోంది. ఈ ఆలయంలో సాక్షాత్తు శ్రీరామచంద్రస్వామి శివలింగాన్ని ప్రతిష్ఠించారని పురాణాలు చెబుతున్నాయి. రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. ఉత్తర రామలింగేశ్వరుస్వామి భక్తులు కోరిన కోరికలను తీరుస్తూ కొలిచే వారికి కొంగు బంగారంగా నిలుస్తున్నారు. సోమవారం నుంచి రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

ఆలయ చరిత్ర..

లంకలో రావణాసురుడిని వధించిన తరువాత శ్రీరాముడు అయోధ్యకు బయలుదేరాడు. సీతాదేవిని అరణ్యమార్గం నుంచి అయోధ్యకు తీసుకువెళ్తూ కోటి లింగాలను ప్రతిష్ఠిస్తున్నాడు. ఈనేపథ్యంలో సాయంసంధ్య వేళలో పుణ్యస్నానమాచరించిన శ్రీరాముడు ఉత్తర రామేశ్వరంలో శివపూజ కోసం శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తాడు. శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన శివలింగం నాటి నుంచి నేటి వరకు ఇక్కడ ఉత్తర రామలింగేశ్వరస్వామిగా భక్తులచే నిత్య పూజలను అందుకుంటున్నారు. ఈ శివలింగంపై బాణం గుర్తు కనిపిస్తుంది.

పెరుగుతున్న శివలింగం

శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం ఎంతో మహిమాన్వితమని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ ఆలయంలో శివలింగానికి మరొక ప్రత్యేక ఉంది. గర్భగుడిలోని శివలింగం ప్రతి సంవత్సరం పెరుగుతూ భక్తులను ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ప్రతి పౌర్ణమికి భక్తులు వేల సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

ఇతర జిల్లాల నుంచి..

ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్తర రామలింగేశ్వస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాలతో పాటుగా కర్ణాటక, మహారాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. ప్రతి సోమ వారం, పౌర్ణమి రోజున భక్తులు ప్రత్యేక పూజలతో పాటుగా భజన కార్యక్రమాలను నిర్వహిస్తారు.



ఆలయంవద్ద కొనసాగుతున్న ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఉత్తర రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 11 వరకు కొనసాగనున్నాయి. సోమవారం గణపతిపూజ, పుణ్యావచనం, రుద్రహోమం, అంకురార్పణం, ధ్వజారోహణం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం



రామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేకంగా క్యూలైన్‌లు ఏర్పాటు చేశాం. ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని టెంట్లు వేయించడం జరిగింది. ఆలయం ఆవరణలో మంచినీటి వసతి, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేశాం.

– శివకుమార్, ఆలయ ఈఓ, రామేశ్వరం

కోరికలు తీర్చే దైవం



శ్రీరాముడు స్వయంగా శివలింగాన్ని ప్రతిష్ఠించడంతో ఈ శివలింగానికి ఎంతో మహిమ ఉంది. ఉత్తర రామేశ్వరం దేవాలయంలో వెలిసిన శివలింగానికి పూజలు నిర్వహిస్తే ఎంతో పుణ్యం లభిస్తుంది. ఏటా శివరాత్రి సందర్భంగా దేవాలయంలో బ్రహ్మోత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తాం.

– రవీందర్‌రావు, ఆలయ ధర్మకర్త, చైర్మన్, రామేశ్వరం

‘ప్రజాదీవెన’ జయప్రదం చేయండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాహుల్‌గాంధీ చేపట్టిన న్యాయ యాత్రకు సంఘీభావంగా 6న మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న ప్రజాదీవెన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ కోరారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నెలకొన్న అవినీతి, అన్యాయాలు, దుర్మార్గ పాలనకు వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ దేశ వ్యాప్తంగా న్యాయయాత్రను చేపట్టారని అన్నారు. న్యాయయాత్రకు సంఘీభావంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ వ్యాప్తంగా ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి పాలమూరు న్యాయయాత్రను చేపట్టారని తెలిపారు. ప్రజాదీవెన సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని అన్నారు. గత పదేళ్ల కాలంలో ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. అనంతరం ప్రజాదీవెన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు మహ్మద్‌అలీఖాన్‌బాబర్, తిరు పతిరెడ్డి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

గ్రామసభలతో ప్రయోజనం

తహసీల్దార్ అజీంఅలీ

కేశంపేట: ధరణి సమస్యలపై నిర్వహిస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అజీంఅలీ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొత్తపేట, సంతాపూర్, చింతకుంటపల్లి, ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామాల్లో ధరణి గ్రామసభలను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. కొత్తపేట గ్రామసభలో పాల్గొన్న తహసీల్దార్ అజీంఅలీ ధరణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలో రెవెన్యూ అధికారులతో పాటు అగ్రికల్చర్ అధికారులు పాల్గొంటున్నారని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ గీత, ఆర్‌ఐ నివేదిత, సీనియర్ అసిస్టెంట్ మహేందర్, మహేశ్, జంగయ్య, రెవెన్యూ సిబ్బంది శ్రీకాంత్, వెంకటేశ్, శ్రీను, శివకుమార్, శివలీల, నరసింహ, శ్రీరామ్, రాజు, వ్యవసాయ విస్తరణ అధికారులు సమీయొద్దీన్, ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శులు శేఖర్, మల్లేష్, హన్మంత్‌రెడ్డి, గ్రామస్తులు నరేష్ యాదవ్, జగన్‌రెడ్డి, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట గ్రామసభలో పాల్గొన్న అజీంఅలీ

బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తాం

షాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తామని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో పెద్దవేడు మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌కు మాత్రమే ఉందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అందరికీ అన్ని ఇస్తామని, ఇప్పుడు మాత్రం కొందరికే ఇస్తామంటుందని ఎద్దేవా చేశారు.



మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి శ్రీనివాస్‌గౌడ్

చేవెళ్ల ట్రాఫిక్ సీఐగా వెంకటేశం



చేవెళ్ల: చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా సీఐ ఎస్. వెంకటేశం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చేవెళ్లలో ట్రా ఫిక్ సీఐగా పని చేసిన సైదులు కమిషనర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చందనగర్ పోలీస్‌స్టేషన్‌లో డీఐ ఇన్స్‌పెక్టర్‌గా ఉన్న ఎస్. వెంకటేశం చేవెళ్లకు బదిలీపై వచ్చారు.

ఆర్థిక సాయం

షాబాద్: గుండెపోటుతో హఠాన్మరణం చెందిన తాళ్లపల్లి వరమ్మ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లీ మహేశ్ అండగా నిలిచారు. మండల పరిధిలోని దైవాలగూడ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్న ప్రతి నిరుపేదల కుటుంబానికి తన వంతు సహాయం చేసి ఆదుకుంటానని మహేశ్ అన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కొడంగల్: రోడ్డు భద్రతపై డిగ్రీ కళాశాల విద్యార్థులకు సోమవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1,2 ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. రోడ్డు ప్రయాణం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు హెల్మెట్ పెట్టుకోవాలని, కార్లు నడిపే వారు సీటుబెల్టు ధరించాలని చెప్పారు. మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శివరాం గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ రఫియా, కో ఆర్డినేటర్ రాంబాబు, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ సోమ్లా, శ్రీధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల అభివృద్ధికి కృషి



కిట్స్ అందజేసిన చైర్మన్ రవినాయక్

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రవినాయక్

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ కృషి చేయడం జరుగుతుందని ట్రస్ట్ అధ్యక్షుడు రవినాయక్ అన్నారు. సోమవారం మండలంలోని అమ్డాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థులకు దాతలు హైమావతి, సుచిత్ర సహకారంతో ఎగ్జామ్‌కు సంబంధించిన కిట్స్ అందిస్తున్నామన్నారు. ఈ నెలలో పదవ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో కిట్లు విద్యార్థులకు ఉపయోగపడుతాయని తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రేణుక, ఉపాధ్యాయులు సత్యనారాయణ, నాగేష్, సంగీత, సుధా, మంజుల, మణికంఠ, మొగులయ్య, అనుపమ, రాధా, జ్యోతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

కనకమామిడి పశువైద్య అధికారి శ్రీలతరెడ్డి

మొయినాబాద్‌రూరల్: పాడి పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని కనకమామిడి పశువైద్య అధికారి శ్రీలతరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కనకమామిడిలో పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. వేసవికాలంలో పశువులను ఎండలో తిప్పకూడదని, ఎక్కువ నీటిని అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న శ్రీలతరెడ్డి

చాప్‌కట్టర్స్‌కు అనుమతి ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న యాదవరెడ్డి

భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు యాదవరెడ్డి

షాబాద్: పాడి రైతులకు చాప్‌కట్టర్స్ వాడుకోవడానికి విద్యుత్ అధికారులు అనుమతి ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి కోరారు. సోమవారం షాబాద్ రైతు వేదికలో పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడిరైతులకు పొలాల వద్ద చాప్‌కట్టర్లను వాడుకోవడానికి విద్యుత్ అధికారులు అనుమతి ఇవ్వాలన్నారు. పశువులకు మేత కోసం చాప్‌కట్టర్లను వాడుతున్న రైతులపై విద్యుత్ శాఖ అధికారులు ఫెనాల్టీ వసూలు చేస్తున్నారని వాపోయారు. చాప్‌కట్టర్ల కోసం పాడిరైతులు డీడీలు చెల్లిస్తామని, అనుమతి ఇవ్వాలని విద్యుత్ అధికారులను కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి, రైతులు వెంకట్‌రెడ్డి, చంద్రయ్యగౌడ్, మల్లయ్య, చంద్రబాబు, గౌతం తదితరులున్నారు.

మార్మోగిన శివనామస్మరణ



శ్రీశైలం తరలుతున్న శివస్వాములు

కొందుర్గు: మండల కేంద్రంతో పాటు జిల్లేడ్ చౌదరిగూడ మండలం చెన్నారెడ్డిగూడలో సోమవారం శివ నామస్మరణ మార్మోగింది. కొందుర్గులో గురుస్వా మి సత్యనారాయణ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ నిర్వహించి, ఇడిముడి ధరించి శివస్వాములు శ్రీశైలం బయలుదేరారు. అలాగే, చెన్నారెడ్డిగూడలో గురుస్వామి భూపాలచారి ఆధ్వర్యంలో శ్రీనివాస పౌల్ట్రీ ఫాంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో యాదయ్య, వెంకట్‌రాములు, నర్సింలు, రామకృష్ణ, వీరేందర్, సాయి, అంజి, నాగరాజు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

షాద్‌నగర్‌రూరల్: నేల స్వరూపాన్ని గుర్తించి పంటలను సాగు చేసుకోవాలని ఉద్యాన విద్యార్థులు రైతులకు వివరించారు. సోమవారం కొండాలక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామీణ భాగస్వామిక విశ్లేషణాత్మక సదస్సును నిర్వహించారు. గ్రామంలోని నేలల యొక్క స్వరూపం, విస్తీర్ణంపై చార్ట్స్ రూపంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో పండుతున్న కూరగాయలు, మిర్చి, టమాట, పూల పంటల సాగు విస్తీర్ణం గురించి తెలియచేశారు. పంటల సాగుకు ముందుగా నేల ఎలాంటి సారాన్ని కలిగిఉంది, ఏ పంట వేసుకోవాలనే విషయాలను తెలుసుకొని పంటలు సాగుచేస్తే అధిక దిగుబడి వస్తుందని వివరించారు. ఉద్యాన పంటల్లో జాగ్రత్తలు పాటిస్తే మంచి లాభాలు ఉంటాయని అన్నారు. ప్రతి రైతు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ పంటలను సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు రామచంద్రారెడ్డి, రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణయ్య, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పంటల సాగుపై అవగాహన విద్యార్థులు

రోడ్డుపై పడిపోయిన మర్రిచెట్టు

ట్రాఫిక్‌తో వాహనదారుల ఇబ్బందులు

చేవెళ్ల: హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ఓ పెద్ద మర్రిచెట్టు విరిగి రోడ్డుపై పడిపోయింది. ఈ సమయంలో వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. మండలంలోని కేసారం బస్టాప్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తులు చెట్టుకు నిప్పు పెట్టడంతో కొద్ది కొద్దిగా కాలుతూ ఒక్కసారిగా పడిపోయిందని స్థానికులు చెప్పారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అసలే రద్దీ రోడ్డు కావటంతో రెండు వైపుల కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామయ్యింది. పోలీసులు, స్థానికులు సహకారంతో మర్రిచెట్టును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లీయర్ చేశారు. దాదాపు గంటకుపైగా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన మర్రి చెట్టు